# రాజ మహిషి


హంసేశ్వరరాయ్ జమిందారు. ప్రభుత్వం జమీని స్వాధీనపర్చుకున్నా, ధన సంపత్తికి లోపం లేదు. కలకత్తాకు కొద్దిదూరంలో ఉన్న రాధానాధపురం మాత్రం చేతిలో ఉంచుకున్నాడు. ఇక కలకత్తా నగరంలో చిన్నవీ పెద్దవీ కలుపుకొని పదహారు బంగళా లున్నాయ్! ఇవిగాక – బ్రాబర్న్ రోడ్డులో ఎనిమిదంతస్థుల మేడా, చౌరంగీలో ఆరంతస్థుల మేడా, సదరన్ ఎవెన్యూలో మూడంతస్థుల మేడా, నెల నెలా ఐదారు వేల రూపాయీలు అద్దెల మూలంగా అందిస్తున్నాయ్! ఆ పదహారు బంగళాలమీదా రమారమీ పన్నెండువేల రూపాయీలు వస్తున్నవి. ఆపైని – కొన్ని ప్రయివేటు రంగాల్లో షేర్లూ, ఇచ్చీ పుచ్చుకొనే వ్యాపారమూ ఉన్నాయ్! అతని వయసు ఏభైకి అటూ యిటూలో ఉన్నది.

హంసేశ్వరుని అర్ధాంగి హేమాంగినీదేవి. ఆబిడకు సంసార తాపత్రయంలేదు. పాపం! మోయలేనంత శరీరం! పదడుగులు వేయడం ఆమెకు కనాకష్టం! రాత్రీ పగలూ 'స్ప్రింగ్' మంచంలో పట్టు పరుపుల మధ్య పడి ఉంటూ, లావు తగ్గడానికి ఏవో తీయ తీయని మందులు తింటూ, నవలలూ, కథలూ చదువుతూ కాలం వెళ్ళబుచ్చుతుంది. ఆ దంపతులకు ఒకే ఒక సంతానం! ఆడపిల్ల! పేరు చకోరి! ఎం. ఏ. పూర్తి చేసింది. ఇంకా అవివాహిత!

కలకత్తాలో ఉండడమంటే హంసేశ్వరునికి చిరాకు. ఆ మహానగరపు వాతావరణం అతని ప్రకృతికి సరిపడదు. అందువల్ల రాధానాధనగరంలో సువిశాల భవనం కట్టించుకొని, భార్యా కుమార్తెలతో ఉంటున్నాడు. ఊరికి వెలపల మామిడి, పనస, కొబ్బరి, అరటితోట లున్నాయ్. మూడు పెద్ద చెరువులూ ఆ చెరువులనిండా రోహూ, కతలా, మృగాల్, మాగుర్ యిత్యాదులైన విలువైన చేపలూ! ఆ తోటలమీదా, చెరువుల మీదా ఏడాదికి పాతికవేలు తక్కువకాని ఆదాయం వస్తుంటుంది! ఇవిగాక పెద్ద జాతికోళ్లూ, బాతులూ, గినీలూ, టర్కీలూ పావురాలూ కోకొల్లలు పెంచుతుంటాడు. ఇక కాయగూరలు – వంగ, బెండ, గుమ్మడి, ఆనప, చిక్కుడు, కాబేజి, కాలీఫ్లవరు, టొమేటో, ముల్లంగి, నూల్

---

మూలం: పరశురామ్ అనువాదం. కు॥ జానకిరామ్ పట్నాయక్



కోలు, తోట, బచ్చలి, ఆవ, మెంతి, కొతిమేర ఇత్యాదులు! వాటిని సంతల్లో అమ్మిస్తుంటాడు. పశుసంపదా అంతే. అదీ అలానేఉంది: ఆవులూ, గేదెలూ, మేకలూ, అన్నీ ఎన్నికైనవే! పాలూ, పెరుగూ, నేయీ కుంభవృష్టి అంటే అతిశయోక్తి కానేరదు!

ఆ మధ్య పశ్చిమ పంజాబులోని గుజరన్ వాలాప్రాంతం నుంచి భేషైన ఒక గేదెను తెప్పించాడు. ఆ సందర్భంలో — పాకిస్తాన్‌లో ఉన్న ఒక స్నేహితునికి పుష్కలంగా ముడుపుకూడా చెల్లించుకున్నాడు. ఆ గేదె బహులక్షణమైంది! అందుకని దానిపేరు 'రాజమహిషి' అని ఉంచాడు! కొద్దిరోజుల క్రితమే మొదటి యీత యీనింది. రాబోయే 'వెస్ట్‌బెంగాల్ కేటిల్ షో'లో ఆ గేదెను ప్రదర్శింప నిశ్చయించాడు. ఆ 'కేటిల్ షో'కు అతనికి ప్రబల ప్రతిద్వంద్విగా — తాల్‌దీఘీలో ఉన్న రాయ్‌సాహేబ్ మహీమ్ బెనర్జీ నిల్చున్నాడు! ఆ బెనర్జీ మహాశయుని దగ్గర ముల్తాన్ గేదె ఒకటున్నది. ఐనప్పటికీ తనకే — అంటే — తన రాజమహిషికే 'గవర్నరు మెడల్' వస్తుందని హంసేశ్వరుడు ప్రబల విశ్వాసంతో ఉన్నాడు.

చకోరి కలకత్తాలో మేనమామఇంట్లో ఉండి ఎమ్మే పూర్తి చేసింది. తరవాత తలిదండ్రుల్తో రాధానాధ నగరంలో ఉంటున్నది. చకోరి సన్నగా, పొడవుగా, చామన చాయగా ఉంటుంది. ముందరి రెండుదంతాలూ బయటకు పొడుచుకు వచ్చిన కారణంవల్ల మరుగుపడి పోవాల్సిన అనాకారితనం కొట్టొచ్చి

నట్టు కనిపిస్తూ ఉంటుంది! ఎన్నివిధాలైన 'మేకప్' చేసుగుంటున్నా, అందగత్తె అనిపించుకో లేక పోతున్నది; ఈర్ష్యాళువులైన ఆమె సంగాతకత్తెలు కొందరు 'కాళీమాయ్' అనిపేరుపెట్టారు! ఐతే — తండ్రికి ఉన్న లక్షల ఆస్తి చూసి ఆమె వెంట కొందరు యువకులు పరుగులు తీస్తున్నారు. ఆ యాస్తేగాని లేనట్టయితే చీపురుపుల్ల కున్న విలువైనా ఉండదని చాలమంది అభిప్రాయం!

కుమార్తె వివాహం విషయంలో హేమాంగినీదేవికి ఏ బాదరబందీ లేదు. హంసేశ్వరునికి అసలు ఆ ధ్యాసేలేదు—

"అమ్మాయి మంచి చురుకైందీ, తెలివితేటలు కలదీన్నీ! ఈ కాలం పిల్లల్లాంటిది కాదు. కళ్ళు మూసుకొని ప్రేమకలాపాల్లో పడే మూర్ఖురాలు గాదు... బాహ్యవేషాలు చూసి, తియ్య తియ్యటి కబుర్లు విని యువకులు పన్నిన ఉచ్చుల్లో తగులుకొనే అమాయకురాలు కాదు... అందువల్ల దాని వివాహానికి ఎందుకు విచారించాలి? ఇక వయసుమీరిపోతున్నదీ అంటారేమో?... దానికేం? ...ఈ రోజుల్లో ముప్ఫయి ఏళ్ళవరకూ పెళ్ళి కాకుండా ఎంతోమంది ఉన్నారు!... నా చకోరి తనకు తానే నచ్చినవాణ్ణి తెచ్చుకుంటుంది?." అని అంటూ ఉంటాడు.

చకోరిని వివాహమాడ్డానికి ముందుకు వచ్చిన యువకుల్లో వంశీధర చటర్జీ చెప్పుకోతగ్గవాడు. ఈ మధ్యనే పి హెచ్. డి. ఉపాధి పొందాడు. టాలీగంజిలో ప్రొఫెసరుగా ఉంటున్నాడు. బోటనీ, జువాలజీ, అతని ఐచ్ఛిక విషయం! అతనితండ్రి శశిధర చటర్జీ రెండేళ్ళక్రితం స్వర్గధామం చేరుకున్నాడు. బతికున్న రోజుల్లో వకీలువృత్తి చేస్తుండేవాడు. కలకత్తాలో హంసేశ్వరునికి ఉన్న చరస్థిరాస్తుల్ని చూస్తూండేవాడు. వంశీధరుని తాతగారి వూరు రాధానాథనగరం అవడంవల్ల తరుచుగా వంశీధరుడక్కడకు రాకపోకలు చేస్తుండేవాడు. దానా దీనా చకోరికీ, అతనికీ చిన్నతనం నుంచీ పరిచయం ఉన్నది. హంసేశ్వరుణ్ణి 'చాచాజీ' అని పిలుస్తుంటాడు.

దుర్గాపూజ శలవుల్లో వంశీధరుడు రాధానాథపురం వచ్చి ఉన్నాడు. ఒకనాడు చకోరితో "ఇక ఆలస్యం దేనికి చకోరీ? నీ చదువు సంధ్యలు పూర్తి ఐపోయాయ్! నావీ ఐపోయాయ్! ఏదో ఒక ఖాయమైన ఉద్యోగం చేస్తున్నాను. ఇక సంశయం ఎందుకు?... నువుగాని 'ఊఁ' అన్నావంటే మీ నాన్నగారితో మాటాడుతాను" అన్నాడు. అందుకు చకోరి "చూడు వంశీధరబాబూ! నువ్వీ విషయం అతి సామాన్యమైంది అన్నట్టుగా మాటాడుతున్నావ్! కాని అనుకుంటున్నంత సామాన్యమైంది కాదుసుమా?....ఔఁ! నన్నడిగితే మాత్రం నువు నచ్చినట్టు చెప్పడానికి సిద్ధంగా ఉన్నాను ఐతే— నాన్నగారు మాత్రం — ఓ పట్టాన రాజీకి

వస్తా రనుకోను! అతని ప్రకృతీ, పద్ధతీ వేరు! ఏవో లోపాలు తెయ్యక మానరు! అతణ్ణిగాని సుముఖునిగా చేసుకున్నా వంటే — నాకే ఆటంకమూ లేదు. సాహసమూ, దృఢ సంకల్పమూ ఉన్న ట్టయితే. ఒకసారి వారితో మాటాడు!" అన్నది.

మర్నాటి ఉదయం వంశీధరుడు హంసేశ్వరుని దగ్గరకు వెళ్ళి సవినయంగా "మీతో కాస్త మాటాడాలి" అన్నాడు. ఆ సమయంలో హంసేశ్వరుడు రాజమహిషి సేవా శుశ్రూషల్లో నిమగ్నుడై ఉన్నాడు. వంశీధరుని వేపు చూడనైనా చూడకుండా "కాస్త తాళు" అని రాజమహిషికోసం ప్రత్యేకంగా నియుక్తుడైన నౌకరు గోపీరామునితో "చూడు గోపీ! రాజమహిషిని శుభ్రంగా కడిగి, తడి లేకుండ తుడిచిపెట్టు. ఎక్కడైనా సిసరంత మురికి కనిపించిం దంటే నీ పని ఏమవుతుందో చెప్పక్కర్లేదు! ఆఁ! జాగ్రత!....అర్రే?.... ఆ పొదుగు అంతా దోమకాట్లూ, జోరీగలూ... కనిపించలేదూ?...సోమారి వెధవా...ఏం చేస్తున్నావ్? డి.డి.టి. జల్లలేదూ?" అన్నాడు.

"జల్లుతునే ఉన్నాను హుజూర్!... మస్తుగా జల్లుతున్నాను! కాని ఆ మందుకు దోమలూ, జోరీగలూ లక్ష్య పెట్టలేదండి!...తమరుగాని శలవిస్తే మా వూరునుంచి నాలుగు మబ్బు కొంగలు తెస్తాను. వాటిని కొట్టంలో ఉంచితే యీ దోమలూ, జోరీగలూ, ఇంకా చిన్నచిన్న పురుగులూ మాయమైపోతాయ్:....ఆ కొంగలు వాటన్నిట్నీ 'టప — టప' మని మింగివేస్తాయ్!" జవాబిచ్చాడు గోపీ రాముడు.

"కొంగల్ని అలా వదిలేస్తే ఎగిరి పోవూ?"

"ఎగిరిపోవు హుజూర్! రెక్కల్ని కాస్త కత్తిరించివేస్తే సరి! పది పదిహేను రోజుల్లో మా వూరునుంచి మా పినతండ్రి రానై ఉన్నాడు. తమరు శలవిస్తే కొంగల్ని తెమ్మంటాను. ఆఁ....నాలుగింటికీ... ఓ యిరవై రూపాయీ లవుతుంది."

"సరే....ఇవ్వాళే ఉత్తరం రాయ్! రూపాయీ లిస్తాను. మనీయార్డరు కట్టు" అని హంసేశ్వరుడు వంశీధరుణ్ణి తోడ్చుకొని ఆఫీసు రూములోకి తీసుకువెళ్ళి "ఏం మాట్లాడాలని కొచ్చావ్ వంశీ?" అని ప్రశ్నించాడు

వంశీధరుడు తల వంచుకొని చేతులు నులుముకుంటూ "చాచాజీ? చాలా రోజులైంది. ఒక కోరిక....మనసులో పెట్టుకున్నాను. ఇవ్వాళ...తమతో దాన్ని విశదీకరించుకుందా మని —" అన్నాడు.

"ఓహో....తెల్సింది!... చకోరిని పెళ్ళాడే కోరికేకదూ?" ప్రశ్నించాడు హంసేశ్వరుడు గంభీరంగా.

"ఆ(....చిత్తం!" అన్నాడు జంకుతూ, భయపడుతూ వంశీధరుడు.

"వంశీ! నేను కుండ బద్దలుకొట్టినట్టు మాటాడేవాణ్ణని నీకు తెలుసు!...చూడు! అల్లునికి ఉండాల్సిన లక్షణా లన్నీ నీలో ఉన్నాయ్! రూపురేఖలు కూడా మంచివే! ఇక చదువూ సంస్కారమూ వేరే చెప్ప నక్కరలేదు. మీ సాంప్రదాయం నాకు తెలిసినట్టు మరొకరికి తెలియదు! కాని_ఆర్థిక స్థితిమాత్రం ఉండాల్సిన దానికన్నా ఎంతో తక్కువగా ఉన్నది. మీ నాన్నగారు వకీలువృత్తి చేశారన్నమాటేగాని, వెనక వేసింది శూన్యం! ఆ(.... కలకత్తాలో పేరుకు ఆ పాతయిల్లు ఒకటి ఉన్నది. అందులో నీ తల్లీ, నీ తల్లి తల్లీ, తమ్ములూ, అక్క చెల్లెళ్ళూ. మేనళ్ళుళ్ళూ, అంతా కోళ్ళ సంసారంలా, ఇరవై నాలుగు గంటలూ 'బిల _ బిల' మంటూ ఉంటారు! ఆ 'రణగొణ' ధ్వనిలో చకోరి ఒక నిముషంకూడా నిభాయించలేదు. ఆ పిమ్మట _ నీ ఆదాయం! ప్రొఫెసరీ చేసి నెలకు రెండొందలు తెస్తుంటావ్! కొన్నాళ్ళకు మరో ఏభై అంటే రెండు వందల ఏభైకి చేరుతావనుకో! ఇదే మాత్రం? దీంతో చకోరిని సంబాళించ గలవా? సబ్బులూ, క్రీములూ, పౌడర్లూ, సెంట్లూ, తలనూనెలూ, లిప్‌స్టిక్కులూ. వీటికింద నెలకు రెండువందలకు పైగా చకోరి ఖర్చు పెడుతున్నది. అలాంటిది నీ సంపాదన ఏ మాత్రం?.....ఆ(! బహుశా నువ్వొకటి ఆలోచిస్తూ ఉండొచ్చు!...కూతురుకూ, అల్లునికీ ప్రతీ నెలా దిట్టమైన రొక్కం నే నిస్తూంటా ననీ, దాంతో బాగా మజా చేయొచ్చుననీ! కాని _ ఆ యాలోచన ఈ జన్మలో పెట్టుకోకు! నా 'ప్రిన్సిపల్స్' వేరు!...నీ ఆలోచనలు వేరు!..."

వంశీధరుడు అప్రతిభుడై కొద్ది క్షణాలు ఊరుకున్నాడు. తరవాత మనసు కూడదీసుకొని అన్నాడు _

"నేను పేదవాణ్ణయిన మాత్రాన ఏమైంది; డబ్బుకు పేదవాణ్ణిగాని తక్కిన వాటికికాదే? తమకు చకోరి తప్పించి యితరత్రా సంతానం లేదుకదా? తమ అనంతరం ఆమేకదా వారసురాలు! ఈ వైవాహిక జీవితంలో ఆర్థికంగా ఆమె చిక్కులు పడుతుంటే తమరు ఉపేక్షిస్తారా? తగినలా సాయపడరా?"

"నా 'అనంతరం' _ అన్నది చాలా దూరం ఉంది వంశీ! నేను కనీసం యింకో ఏభై సంవత్సరాలైనా బతుకుతాను. ఈ వ్యవధిలో ఒక చిల్లికానీ కూడా రాల్చుతా నన్నది కలలో వార్త! చకోరి అవివాహితగా ఉన్నంత కాలమూ నా డబ్బు యిష్టానుసారం ఖర్చు పెట్టుకోగలదు! నే నడ్డు చెప్పను! కాని _ వివాహమైన మరుక్షణంనుంచి ఆమె బరువు బాధ్యతలు ఆ భర్త అన్నవాడే వహించాలి! నువ్వన్నట్టు మీ ఇద్దరి భరణపోషణా, ఖర్చు వెచ్చాలూ నేను భరిస్తే నీ మగ

తనానికి పెద్దదెబ్బ అంటావా లేదా? మామగారి ఆస్తిమీద ఆధారపడ్డ వానిని లోకం ఎలా ఆడిపోస్తుందో, పైగా, ఆ భార్యా దృష్టిలో వాడెంత చులకనై పోతాడో కాస్త ఆలోచించావా? ఐనా ఈ 'చారిటీ మేరేజీ' అల్లుని జంజాటం నెత్తిని పెట్టుకొని నేనెందుకు ఊరేగాలి?"

వంశీధరుని తలమీద యీ మాటలు పిడుగులు పడ్డట్టయింది! నిరాశతో "ఐతే నాకు తరుణోపాయం లేదా?" అన్నాడు.

"లేకేం?...ఉంది!...నువు శాయశక్తులా ధనాదాయానికి కృషి చేయ్! నీ నెలసరి ఆదాయం కనీసం రెండువేలు అయాక మాటాడు!"

"ఇంత ఆదాయం చేసుకోగలనన్న ఆశ అసలీ జీవితంలోనే ఉండదేమో?.. పైగా అంతవరకూ చకోరి వేచి ఉండగలదా?"

"ఏమో, ఆ సంగతి ఎలా చెప్పగలను? ఎందుకైనా నువ్వే చకోరిని అడిగి చూడు!...ఆఁ! ఏవో కల్లబొల్లి కబుర్లు చెప్పి నా ఆశయాలకు విరుద్ధంగా చకోరిని పెళ్ళి చేసుకున్నావా నా యావదాస్థీ హరిణ్ ఘాటుకు దానం చేసి వేస్తాను! ఒకప్పుడు నా సమస్త సంపదలూ చకోరికే చెందిపోయిందనుకో! ఐతే మాత్రం నీ కొరిగే దేముంది?... వంశీ! మా చకోరి సంగతి నీకింకా తెలియదు. అది స్వవిషయంలో డబ్బును నీళ్ళప్రాయంగా ఖర్చు పెడుతుంది! కాని — ఇతరుల పట్ల — రాగిపైసా రాల్చదు! దానికి ఎవరిమీదా విశ్వాసం లేదు! బ్యాంకు చెక్కు పుస్తకాలన్నీ దాని ఆధీనంలోనే ఉంటాయంటే నమ్ము! నిన్నసలు ఎందులోనూ దఖలు పడనివ్వదు! ... ఆఁ ... ఏదో నీ సిగరెట్ల ఖర్చుకు నెలనెలా యింత పారేస్తుంది. తరవాత నీ పుట్టినరోజు వస్తే ఏ రిస్టు



వాచీయో, సిల్కు సూటో, షార్పర్ శైంటీ ఫౌంటన్ కలమో, బహూక రిస్తుంది! అంతే! ఇంతకూ నన్నడిగితే మాత్రం — నువు చకోరిని వివాహమాడే తలంపు ఒదులుకోవడం మంచి దంటాను!"

వంశీధరుడు మారు మాటడకుండా తలవంచుకొని వెళ్ళిపోయాడు. ఆ సాయంత్రం చకోరి, జరిగిన విషయాలన్నీ వంశీధరుని నోటినుంచి విని "నాన్నగారిలా అంటారని నాకు ముందే తెలుసు" అన్నది.

"సరేకాని చకోరీ! నువ్వేమంటావ్? నిజంగా నువు నన్ను హృదయపూర్వకంగా అభిలషిస్తూ, ప్రేమిస్తూ ఉన్నావంటే యీ ఆస్తిపాస్తులూ, డబ్బూ దస్కాలూ నీకొక లెక్కా? వాటిని కాలదన్ని నా వెంట వెళ్ళిపోరాగలవ్! ఏం! ప్రేమ కోసం ఆడది ఎన్నెన్ని త్యాగాలు చెయ్యలేదు? చదువుకున్న దానవు! సంస్కారమున్న దానవు! నాగరికత గలదానవు! నీకు తెలియని దేమున్నది? నిజంగా నువు నన్ను త్రికరణ శుద్ధిగా ప్రేమిస్తూ ఉంటే నాతో, నా వాళ్ళతో, నా స్వల్పాదాయంతో, ఆనందంగా, ప్రశాంతంగా జీవితం గడపగలవ్!... ఏం?"

చకోరి ఏకాలున నవ్వి అన్నది — "ప్రేమ అనేది చాల ఉన్నతమైన వస్తువు! అది మన యిద్దరిలోనూ ఉన్నది! కాదనను!... ఐతే — డబ్బులేని ప్రేమ — చక్రాలు లేని బండి లాంటిది! ఈ నాటి జీవిత పథంలో ఆ బండి భూపతనమైపోక మానదు! అప్పుడు అంతా శూన్యంగా, శుష్కంగా కనిపిస్తుంది! ఉద్రేకంలో ఎన్నయినా చెప్పగలం! కాని — కార్యరూపంలోకి వచ్చేసరికి తెలుస్తుంది అసలు జీవితం!... నాన్నగారు నా విషయంలో చిలవలు పలవలుగా చెప్పుకొచ్చారు! అదంతా నిజమనుకొని నన్ను హృదయం లేని పిశాచినిగా భావించకు! కాగా — అతనైనా ఏమంత కొండమీద కూచోలేదు! నిన్ను మంచి ఉద్యోగం—అంటే— నెలకు కనీసం రెండు వేలైనా ఆదాయం వచ్చే ఉద్యోగం చూసుకో మన్నారు. దానికి నువ్వెందుకింత బేజారై పోతావ్?.. ఇటు చూడు! నువ్వా ప్రొఫెసరు గిరీ విడిచిపెట్టేయ్!... బాగా లాభించే యింకో ఉద్యోగం గురించి ప్రయత్నించు!... నాన్నగారంటే—కొంతమందిమంత్రులకు మంచి ఆదరాభిమానాలూ, గౌరవ ప్రపత్తులూ ఉన్నాయ్! వారితో చెప్పావూ అంటే తప్పక వారు ఏమంత్రి పుంగవుడో కలుసు కొని ఫేషైన ఉద్యోగం యిప్పిస్తారు!"


"సరే బాపుంది! కాని—అంతవరకూ నువు నా కోసం కనిపెట్టుకు ఉంటావా అని?" శుష్కంగా నవ్వి వంశీధరుడు అన్నాడు.

చకోరి కాసేపు మౌనం వహించి "గ్యారంటీ యివ్వలేను! ఐనా — శాయ

శక్తులా ప్రయత్నిస్తాను. ఈలోగా నువ్వు— గోళ్ళు గిల్లుకొని కూచోక, నాన్నగారి వెనకపడు! మంచి అదను చూసి వారిని లోబర్చుకో! అనుకున్న ఉద్యోగం సంపాదించు! కానైతే యిప్పుడు కాదు. ప్రస్తుతం వారి మనసు బాగులేదు. రాత్రీ పగలూ వారి దృష్టి అంతా మా రాజమహిషి మీదనే ఉన్నది. తాల్‌దీఘీలో ఉన్న ఆ మహీమ్ బెనర్జీగారి గేదె రోజుకు యిరవైన్నరశేర్ల పాలిస్తున్నట్టు గుప్తచరు డొకడు నాన్నగారికి కబురందించాడు. అంటే రాజమహిషి కన్నా శేరున్నర యెక్కువ యిస్తున్న దన్న మాట! తదాది నాన్నగారు మరే కార్యకలాపాలూ పట్టించుకొనక రాజమహిషిని సాకడంలోనే పొద్దుపుస్తున్నారు!...పత్తి గింజలూ, వేరుశనగ పప్పూ, చుక్కకూరా, పచ్చి బటానీ కాయలూ టొమేటోలూ, కొబ్బరి కోరూ, కమలా పండ్లూ — మొదలైన పుష్టికర ఆహారం ప్రతీరోజూ యిస్తున్నారు! చివరకు 'విటమిన్ బి కాంప్లెక్స్' కూడా వాడుతున్నారు! ముందు వారి అభిలాష—అంటే రాజమహిషి కేటిల్ షోలో విజయం పొంది బంగారు పతకం బహుమతిపొందడం! తరవాత ఆ యానంద సమయంలో నువు అతని కాళ్ళా వేళ్ళా పడు! తప్పక నీ కోరిక ఫలిస్తుంది" అంది..

* * *

రాబోయే నెలలో పశ్చిమ బెంగాలు పశు ప్రదర్శనం జరగనై ఉంది ఇక్కడ హంసేశ్వరబాబు గొప్ప ఆపదలో చిక్కుకున్నాడు. రాజమహిషి తిండీ తిప్పలూ మానుకుంది. దాంతో పాలివ్వడంకూడా



సగానికి సగమైపోయింది. కారణం-ఆ బడుద్ధాయి గోపీరాముడు! వెధవ పెద్ద ఆపద తెచ్చిపెట్టాడు! సంగతేమిటంటే- రాసపూర్ణిమనాడు సంగాతగాళ్ళతో యాత్ర చూడ్డానికి పక్క గ్రామం వెళ్ళాడు. అక్కడ పొట్టపగిలేలా యీత **కల్లు తాగాడు.** తాగి ఊరుకున్నాడా? నానా హంగామా చేశాడు! పోలీసు లొచ్చారు! వాళ్ళతో బాహాబాహీ యుద్ధంచేసి ఒక జవాను తల పగలగొట్టాడు! అదృష్ట వశాత్తూ ఆ జవాను చావలేదు. అందరనూ పట్టుకొని ఖైదు చేశారు! గోపీరాముని మీద చార్జిషీటు దాఖలైంది. కోర్టులో విచారణ జరిగింది. నేరం రుజువైంది. ఫలితంగా ఆరుమాసాలు కఠిన శిక్ష పడ్డది!...హంసేశ్వరబాబు శాయ శక్తులా ప్రయత్నించి, కలకత్తాలో పేరు బడ్డ వకీలును పెట్టి కేసును పెద్ద మొత్తం జరిమానాతో 'హుషప్' చేయింప జూశాడు. కాని న్యాయాధికారి వినలేదు. వేసిన శిక్షకు తిరుగులేకపోయింది! అప్పటికీ వకీలుగారు తన వాదాన్ని సవి నయంగా కోర్టువారికి నివేదించాడు —

యువరానర్! ఈ గోపీరాముడు జయిల్లో పడి ఉంటే హంసేశ్వర మహాశయులకు చెప్పరాని నష్టం కలుగుతుం దని చెప్ప సాహసిస్తున్నాను. పేరుప్రతిష్ఠలు గడిం చిన వీరి 'షీబఫెలో' — రాజమహిషి — రాబోయే 'కేటిల్ షో'లో 'ఛాంపియన్ షిప్' పొందనై ఉంది! కాని — గోపీ రాముడు లేనందువల్ల ఆ 'బఫెలో' తిండీ తిప్పలు మాని మౌనవ్రతం అవలంబించి ఉంది! అనుకున్న పరిమాణంలో పాలివ్వ లేదు! ... యువరానర్! పరిస్థితులు అధ్యయనంచేసి, ఏదో పెద్దమొత్తం జరి మానా వేసి గోపీరాముని ఖైదుశిక్షనుంచి తప్పించవలసిందిగా ప్రార్థిస్తున్నాను. లేదా - జామీనుమీద కనీసం ఒక నెల రోజులకైనా గోపీరాముని విడుదలచేసి, ఆ 'కేటిల్ షో' అయిపోయాక తిరిగి తమ నిర్ణయం ప్రకారం జైలుశిక్ష విధించండి!—"

ఎంత చెప్పినా, ఎంత వాదించినా, న్యాయాధికారి మనసు చలించలేదు. తను నిర్ణయించిందే ఖాయపర్చాడు! అందు వల్ల గోపీరాముడు యినప కటకటాల్లో యిరుక్కుపోయాడు.

హంసేశ్వరబాబు స్వప్నంలోకూడా అనుమానించలేదు — తన రాజమహిషి గోపీరాముణ్ణి అంతగా ప్రేమిస్తున్నదనీ, వాడు లేనట్టయితే తిండీ తిప్పలూ మాని మౌనవ్రతం పూనుతుం దనీ!

గోపీరాముని స్నేహితులు కొందరు రాజమహిషి నిరశనవ్రతం భంగపర్చాలని ఎంతో ప్రయత్నించారు. కాని కృత కృత్యులు కాలేకపోయారు! అసలు రాజ మహిషి పరిసరాలకు వెళ్ళడానికే వాళ్ళకు ధైర్యసాహసాలు లేకపోయినయ్!... హంసేశ్వరబాబుమాత్రం దానిదగ్గరకు వెళ్తున్నాడు. యావత్తు శరీరమూ మృదు

వుగా తాకుతున్నాడు. అంతే!...కాని - ఎంత బుజ్జగించినా, జిజ్జికొట్టినా, తిండి మాత్రం తినిపించలేకపోతున్నాడు.

వంశీధరుడు సంగతి సందర్భాలు తెలుసుకొని హంసేశ్వరుని దగ్గరకు వెళ్ళాడు. ఆ సమయంలో హంసేశ్వరుడు మేలుజాతి సింగపూరు అరటిపండ్లు చేతిలో ఉంచుకొని, రాజమహిషి పెదవులదగ్గర పెడుతూ, ఏదేదో మాట్లాడుతూ, చిచ్చి కొడుతున్నాడు. కాని రాజమహిషి తల అటూయిటూ ఆడిస్తూ చెవులు 'టప-టప' కొడుతూ అసమ్మతి చూపుతున్నది!

"చాచాజీ! నా చేతనైన సాయం చేయమంటే చేయడానికి సిద్ధంగా ఉన్నాను-" అన్నాడు వంశీధరుడు.

"ఆఁ...ఆఁ...రాజమహిషి కొమ్ములో చిదకబొడిపించుకోవాలంటే ... వచ్చి - సాయంచెయ్!" జవాబిచ్చాడు హంసేశ్వరుడు చిరాగ్గా.

హటాత్తుగా వంశీధరుని తలలో మెరుపులా ఒక ఆలోచన వచ్చింది. మరి అక్కడ నిల్చోకుండా విసవిస పోయి గోపీరాముని స్నేహితుల్ని కలుసుకున్నాడు. వాళ్లతో మాట్లాడి రాజమహిషినిగురించి చాలా విషయాలు తెలుసున్నాడు. ఆ మర్నాడే బయలుదేరివెళ్ళి బర్దవాను జైల్లో ఉన్న గోపీరాముణ్ణి చూశాడు. చాలా సేపు మాటాడాడు. అసలు రహస్యం కనుక్కొని రాధానాధపురం వచ్చాడు.

"చాచాజీ! తమ రాజమహిషి ఇక కడుపునిండా తింటుంది! దానికి తగిన బందోబస్తు చేసుకొచ్చాను! తమ రిక విచారించుకొని ఉండాల్సిన అవసరం లేదు" అన్నాడు వంశీధరుడు ఠీవిగా.

హంసేశ్వరుడు ఆశ్చర్యంతో "ఆఁ? ఏం బందోబస్తు చేసుకొచ్చావో ఆలస్యం చెయ్యక చెప్పు. కానైతే...నువ్వుగాని దానిదగ్గరకు సమీపించావా అంటే కొమ్ముల్తో ఎత్తి ఆకాశానికి విసిరేస్తుంది! అదిమాత్రం గుర్తుంచుకో" అన్నాడు.

"నేను వెళ్ళక్కర్లేదు. తమరే స్వయాన, తమ చేతుల్తో దాన్ని పొట్ట నిండా తినిపించుతారు. నిన్న నేను బర్దవాను వెళ్ళాను. గోపీని కలుసుకున్నాను. వాడినుంచి అసలు రహస్యం లాక్కొచ్చాను."

"ఏమిటా రహస్యం?...నానుపుడు బేరం చెయ్యక చప్పున చెప్పు!"

"సంగతేమిటంటే ... రాజమహిషి తింటూన్న సమయంలో గోపీరాముడు దాని భుజాలనుంచి తోకవరకూ వీపుమీద నిమురుతూ ఒక పాట పాడేవాడు. ఆ పాట విననిది రాజమనిహిషికి తిండిలో తృప్తీ, రుచీ దొరకదు."

"ఆఁ?...ఆశ్చర్యంగా ఉందే?"

"చిత్తం!...రష్యా విజ్ఞానవేత్త 'పైవ్లవ్' ఆశ్చర్యకరమైన యీ విష

యానికి 'కండిషండ్ రిఫ్లెక్స్' అని పేరుంచాడు..."

"ఐతే నే నేం చెయ్యాలి ?"

"తమ రా పాట నేర్చుకొని_పాడాలి!"

"పాడ(డవా ? నా చేతకాదు !"

"మరైతే లాభంలేదు."

"సరే... ఆ పాట ఏమిటో...కాస్త వినిపించు."

"వినిపిస్తా చాచాజీ ! కాని _ ఒక షరతు : ముందీ షరతు తీరుస్తాననిమాట యిస్తే తప్పక పాట వినిపిస్తాను. ఇలా అన్నానని అగ్రహించకండి !"

"షరతా ?.. ఒహో ! తెలిసింది !... చకోరితో వివాహమే కదూ ?"

"కాదు ! చకోరితో వివాహం... ఆ సంగతి యిప్పుడుకాదు. తరువాయిని !.. ప్రస్తుతం ... తమరు ... తమకు గల మూడు మేడల్నీ.. నా ఆధీనం చెయ్యాలి!"

"మూడు మేడలా ?"

"అ( !... బ్రాబర్న్ రోడ్డులోవున్న ఎనిమిదంతస్తులదీ, చౌరంగీలోని ఆరంతస్తులదీ, సదరన్ ఎవెన్యూలోని మూడంతస్తులదీ !"

"ఉఫ్ !... నీ తలకాయ సామాన్యమైంది కాదోయ్ ? ఈ మేడలమీద ప్రతి నెలా ఎంత అద్దె వస్తున్నదో తెలుసా?.. ఐదువేల ఐదువందలు ? తెలిసిందా ?"

"చిత్తం !... తెలుసు !... అ(... ఇంతకు తక్కువ విలువగల షరతుకు నే సంగీకరించేది లేదు ! ఆపైని _ కాలక్రమాన ఆదాయం బాగా పుంజుకుంటుంది. అప్పుడు చకోరిని వివాహ మాడ్డానికి అవకాశంకలుగుతుంది. ఇంకోరహస్యం! ఆ మేడలుగాని నా పరమైతే తమకు 'ఇన్‌కమ్ టాక్స్, ప్రోపర్టీ టాక్స్' బెడద చాలభాగం తగ్గిపోతుంది !"

హంసేశ్వరుడు అప్రతిభుడై చాల సేపు కండ్లు మూసుకొని ఆలోచించాడు. తరవాత అన్నాడు _

"నువ్విలాంటి పిశాచి వవుతా వనుకోలేదు !... సరే !... మ రే మార్గమూ లేనప్పుడు... నీ అభిలాషే కానియ్ !... రాజమహిషి కడుపునిండా తిని, మామూలుగా యిస్తున్న పాలు యిచ్చేపక్షంలో నీ షరతుకు అంగీకరిస్తున్నాను; లేదా... నువ్వీ రాధానాధ నగర పొలిమేరల్లో అడుగు పెట్టడానికి వీలు లేదు !... తెల్సిందా ?"

"చిత్తం : అసలీ జన్మలో నా ముఖం తమకు చూపించను _"

"భేష్ !... అ(... ఆ పాట ... వినిపించు"

"వినిపిస్తా ... కాని...పాటమాత్రం ఛందోచితమైంది కాదు. అంటే తమబోటి వారు వినాల్సింకాదు. ఐతే, ఏం చెయ్యమంటారు ? సమయం అలా వచ్చిపడింది... వినండి _

"రంగేళీ ... బంగారు ... రాజ
మహిషీ

పొంగారే ... నీ వయసు ... పిచ్చి
కలిగిస్తున్నదే !
నీ మాయాజాలంలో.. చిక్కుకున్నానే
నీవు లేని బ్రతుకు నిష్ఫలమే ...
రాజమహిషీ !
ఝుంజన్...ఝుంజన్...ఝుంజన్....
ఝునా ఝున్ ... ఝునాఝున్ ...
ఝునాఝున్..."

"ఛీ...ఛీ ! ఏం దరిద్రం పాట ?" ముఖం వికృతం చేసుకొని హంసేశ్వరు డన్నాడు.

"ఔను ! ఆదిలోనే చెప్పానుగా ?... ఏం చెయ్యమంటారు ?... ఐతే – ఈ పాట వెనక చిన్న ఇతిహాసం ఉంది లెండి !.. గోపీరాము డిక్కడకు రాక పూర్వం దర్భంగాలో ఉండేవాడట ! బంగాళాపాడా (వీధి)లో ఒక మిండగత్తె యింటి సమీపంలో ఎవడో ఆవారాగాడు ఈ పాట పాడుతూ ఉండేవాడట ! ఐతే పాటలో 'రాజమహిషి'కి బదులు 'బంగాళా రాణీ' అని ఉండేదట! ఆ పాట గోపీరాముడు నేర్చుకున్నాడట ! ఇక్కడకు వచ్చాక ఆ పాట రాజమహిషిమీద పెట్టి పాడుతుండేవాడట ! కాలక్రమాన రాజమహిషి ఆపాటకు బాగా అలవాటు పడిపోయింది !—ఇదీ సంగతి !... తమ రీపాట నేర్చుకోవల్సి ఉంటుంది. నేను పాడుతూ ఉంటాను. తమరు నా స్వరంలో స్వరంకలిపి...పాడండి !... ఇవ్వాళరాత్రి పదివరకూ 'రిహార్సల్' చేద్దాం ! రేపు ఉదయానికి తమకు పాట వచ్చేస్తుంది –"

ఇష్టం లేకపోయినా. హృదయం 'ఛీ...ఛీ'. అంటున్నా విధిలేక హంసేశ్వరబాబు పాట నేర్చుకో నారంభించాడు. వంశీధరుడు – రాగమూ, లయా, తప్పకుండా ఉండేలా మధ్య మధ్య చెబుతున్నాడు, చివరి ఆలాపన 'ఝుంజన్... ఝుంజన్...ఝుంజన్...' అన్నది ఎంత ప్రయత్నించినా హంసేశ్వరుని చేత చేయించలేకపోతున్నాడు. ·

"చాచాజీ ! ఆ యాలాపనలోనే ఉంది అంతానూ ! అచ్చంగా గోపీరాముడు చేస్తున్నట్టే ఉండాలి ! అలానైతేనే రాజమహిషి తృప్తిపడుతుంది." అన్నాడు.

మార్నాటి ఉదయానికి హంసేశ్వరుడు పాటా, ఆలాపనా నేర్చుకున్నాడు.

"వంశీ: నువు నా వెనకనే ఉండి 'ప్రోమ్ట్' చేస్తూండు ! నేను పాడుతూంటాను, నువ్వూ నేనూ తప్పించి మరి – మూడోవ్యక్తి ఉండరాదు. ఎవరైనా ఉంటే నేను పాడలేను–"అన్నాడు హంసేశ్వరుడు.

"అలానే కానివ్వండి ! ఐనా – మూడోవ్యక్తి ఎందుకూ ?"జవా బిచ్చాడు వంశీధరుడు.

రెండు బాల్చీలనిండా 'రాజభోగం' తెచ్చాడు వంశీధరుడు. దాన్ని గోళెంలో పోశాడు హంశేశ్వరుడు.

"చాచాజీ !....ఇక పాట.....

కానివ్వండి !" మెల్లగా అన్నాడు వంశీధరుడు.

రాజమహిషి వీపుమీద హంసేశ్వరుడు చేయి వేసి మృదువుగా నిమురుతూ "లక్ష్మీ!....బంగారు తల్లీ!....వజ్రాల మూటా, కడుపారతినమ్మా!...లేకపోతే ఎలాగౌతుంది ?...పాలెలాయిస్తావ్ ?.. ఆ ముల్తానీ ముండను......ఎలా ఓడిస్తావ్ ?..." అంటూ పాట నెత్తుకున్నాడు.

''రంగేళీ...బంగారు...రాజమహిషీ
పొంగారు...నీ వయసు......''

రాజమహిషి తల నెత్తి, హంసేశ్వరునివే పొకసారి చూసి దీర్ఘంగా నిట్టూర్చింది! వెనకనుంచి వంశీధరుడు మెల్లగా ''ఆపకండి...చాచాజీ....పాట నాపకండి!...మనసులోని ఆ వేదనా, విషాదమూ, అంతా పాటలో.... నింపండి !...చివరలో....ఆలాపనలో... తప్పటడుగు వేయగలరు!...అదే ముఖ్యం !'' అన్నాడు.

రాగమూ, లయా తప్పకుండా, అచ్చంగా గోపీరాముడు పాడినట్లే - హంసేశ్వరుడు మూడుసార్లు పాట పాడినాడు. నాల్గోసారి, మొదటి చరణం ఎత్తుకున్నాడో లేదో - రాజమహిషి గోశెంలో తల దించింది.

ఆ నిర్జన ప్రదేశంలో, నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ ఒక మృదుస్వరం - 'చప్...చప్...చప్' అన్నది అంతటా వ్యాపించింది! అంటే-రాజమహిషి తిండికి ఉపక్రమించిం దన్నమాట!

* * *

పదిహేను రోజులైంది. రాజమహిషి పూర్వంకంటె రెండింతలుగా పుంజుకున్నది! గజేంద్రాణిలా శోభిల్లుతున్నది. ప్రతీ రోమకూపమూ గులాబీరంగులో విలసిల్లుతున్నది. అమృతభాండంలా ఉన్న పొదుగునుంచి రోజుకు పాతిక శేర్లు పాలు వర్షిస్తున్నది.

పశ్చిమ బెంగాలు పశు ప్రదర్శనంలో మహీమ్ బెనర్జీగారి ముల్తానా గేదెను రాజమహిషి సునాయాసంగా ఓడించి బంగారు పతకాన్ని గెల్చుకున్నది! గవర్నరుగారు స్వహస్తాల్తో రాజమహిషి కంఠసీమలో రజనీగంధపుష్పమాలను అలంకరించారు! వేలాది ప్రజలు జయ - జయ నినాదాలు చేశారు ! హంసేశ్వరబాబు ఆనందానికి అవధులు లేకపోయినయి !

మర్నాడు —

''ఇక ఉద్యోగం దేనికోయ్ ? నా గుండెలమీద కూచొని ఎంత వసూలు చెయ్యాలో అంతా చెయ్యనే చేశావ్ ?'' అన్నాడు హంసేశ్వరుడు.

"చిత్తం! కానైతే - ఏదో హుందా అయిన ఉద్యోగంకూడా ఉంటేనే కాని 'సెల్ఫ్ రెస్పెక్ట్' అన్నది ఉండదుగదా? లోకం 'ఆఁ - మామగారి డబ్బుతో నవాబుగిరీ వెలిగిస్తున్నాడు. వాడిదీ ఒక బతుకేనా ?' అని ఆడిపోసుకోదూ ?'' అన్నాడు వంశీధరుడు నవ్వుతూ ! ★